# అవగాహనా? అనురాగమా?

ఆషాఢమాసం ఆఖరకు వచ్చేసే ఘడియలవి. అవతల గోదావరి అరవై అడుగులు వంతెనవద్ద చూపిస్తూవుంది. అసలు ఆమె గుడిసె గట్టుక్రింద ఆక్రమణస్థలంలో వేసికుంది. కలగంటామా యేమిటి అంతవరద ఒక్కసారిగా కొట్టుకొస్తుందని? తెల్లవార్లూ చూపొగ్గి చూస్తూచూస్తూ మరిచూస్తే తానే మునిగిపోయేటంత మోసం అగునేమో అని మంచం కుంచం బళ్లుమని తెల్లారడంలో ఒడ్డుకు చేరేసి, గుడిసెముందు తిన్నె, గుడిసిమీద కప్పు తిన్నగా ఏటినీటికి వదలేసి, ఒక్క నిట్టూర్పు విడిచింది ఆమె. ఆ నిట్టూర్పు తోనే, గాలికి వడవ తిరిగినట్టు పడమటనుంచి తూర్పుకు తిరిగింది. ఎఱ్ఱగా బాలభానుడు తూర్పునకు పొడగట్టేడు. ఊరుదారి ఒకటే వన్నెను జాజువారేలా.

"ఈపొద్దు ఏంటిబాబూ!" అని అడిగింది. ఓ శాస్త్రి అలా నదీస్నానానికై నడచిపోతూవుంటే ఈ పొద్దు ఏప్రొద్దయినా, ఆషాఢ మాసం ఇలాంటిది మరి రాదు. ఇంతచేటు కొత్తగోదావరి మరి చూడబోము. నీవొక్క మునకేస్తివా నేనొక్క మంత్రం చెబుతాను. ఉంటే ఒక కానీ ఇవ్వు, లేకుంటే అదేపోయిరి!" అన్నాడు శాస్త్రీజీ!

శాస్త్రీజీకి వయస్సు నలభైయోపడి అయినా, చమత్కారంగా మాట్లాడడంలో ముప్ఫైయోపడి అనవచ్చు. ఈమె వెంటనే అంది. "తానాల కేమొచ్చె; మానాల మహావరద" అని "మానే దేంటి వరదింక? ఈవేళ ఆషాఢం వెడితే రేపు శ్రావణమాసం. ఆపైని భాద్రపదం. విఘ్నేశ్వరుడి చవితికి వీధుల్లో తెప్పానాం తేలానాం" అన్నాడు. "అప్పుడు మీది మాది ఒకటే విగ్నానం, అన్నిళ్ళదీ ఒకటే స్నానం, వేరే నేనూ చేయనక్కరలేదు, తంవరూ చేయనక్కరలేదు" అంది.

గోదావరింకా పోటుమీదుంది. దాపుగా ఏపుగా ఏతట్టు చూచినా క్రొంగ్రొత్త రూపుతోవుంది. కొండల్లోంచి ఏలా వాలుగొన్నదో లంకల్లోంచి అలా జారిపోతూన్నట్టు తోస్తుంది. కొండలంటే వేరే కొండలు కానము ఒక్క పాపికొండల్ని తప్పిస్తే. లంకలంటే ఇన్ని లంకలులేవు. ఒకటి రెండు మూడు. బొబ్బరలంక, పిచ్చుకలంక, మద్దూరులంకలయొక్క ఏక వరస తప్పిస్తే. ఆతట్టు కొవ్వూరే వూరు. ఈతట్టు రాజమహేంద్రవరమే వూరు. మధ్యను పడవలేదు, నావలేదు, రేవులేదు, దెల్లులేదు, గాలితో గయ్యాళిగంపలా అఖండ గౌతమి అంబుధికేసి పరువుల్లు త్రొక్కుతూ వుంది.

శాస్త్రి ఆ గంగవంకచూస్తూ నమస్కరిస్తూ "గోదావరీ మాయీ! గంగామాతా!" అంటూ నీటిలోకి దిగేడు. ఈమె ఈయిల్లాలు ఈడిముంతబాడి ముంత సద్దుకుంటూ గట్టుపైనే గోళ్ళు గిల్లికొంటూ

"అల్లతలోపల ఆషాఢమాసం
వెళ్ళిపోతే తద్ది రాకుండునా?
గోళ్ళకూ గోరింత నేపెట్టనా!"

అని వెల్లికంటూ వూరుకుంది. ప్రవాహం ఇంకా పైకెక్కుతూ వున్నట్టుంది. తెట్ట, నురుగు, చితుకు చీమ అన్నీకూడా నదియొక్క ఉద్ధృతాన్నే సూచిస్తూవున్నాయి కాని, ఏమాత్రం తీతను గనబరచడంలేదు.

బ్రాహ్మణుడు స్నానంచేసి, తిరుగవస్తూ అన్నాడు. "ఓ అమ్మీ! వరద గట్టును దొలిచేస్తూవుంది. కిందనుంచి పడిపోగలవు" అని. పడుచు అంది "బామ్మర్లకు మాం పడిపోవాలనే వుంటుంది పొద్దల్లా!" అని. "మేమేం వలపన్నే పల్లెవాళ్ళంగానీ కాం" అన్నాడు శాస్త్రీజీ. "కాకపోవడమేటి. అళ్ళ జందెం మీ జందెం ఒకటే" అంది. శాస్త్రికి ఆ మాటలో తన ధాటీ కొంత తగ్గించేమనిపి

అదొక్క ర్తే అని తెలుసుకొన్నవాడై "అపైతే! ఆ మంత్రంచెబుతా వినుకో! కొత్తనీటికి చేపెదురీత్తోంది" అన్నాడు. 'ఏకాడ?' అంది. "ఏకాడేంటి? పట్నంలోని మరుగుకాలవ లన్నింటికాడ" అన్నాడు. "అయితే ఏరూ ఊరూ ఒకలాగే వున్నాయి" అంటూ బ్రాహ్మణుని వెనకాలే వెళ్లింది ఆ వితరి.

దాంది అసలు పాలెం. ఆ సంగతైనా అది చెబితేనే చెవి కెక్కుతుంది. మరేపాలెం అంటే "గొల్లపాలెం" అని గాని "జువ్వలపాలెం" అనిగాని ఏదీ చెప్పలేదు. దానికో యిరవై అయిదేళ్ళుంటాయి. ఇల్లుండడంచేత ఇల్లాలు అని అనుకోవల సిందేకాని పెళ్ళి ఏనాడైందో? పెనిమిటిని విడిచిపెట్టిన ఎరువు మనిషిలాగే కాపడ్డది. అల్లుడే మల్లుడు, మల్లుడే అల్లుడు ఆ ఆడ మనిషికి. అధికారిని ఓలాగే చూస్తుంది, అనధికారినీ ఓలాగే చూస్తుంది ఆ మ్మత్తకాశిని. చెట్టుక్రింద కాఫీ అమ్మే జగన్మోహిని కంటె జవరాలిలా ప్రవర్తిస్తుంది. నన్ను ముట్టుకోకన్నట్టు కుట్టెల చప్పుడు చేసుకుంటూ గబగబా నడచిపోయే సినిమా ప్రేక్షకురాలి కంటె నవనాగరీకంగా నర్తిస్తుంది.

"బాపనయ్యా! నిజం సెబుద్రూ! ఈపొద్దుతో అషాఢ మాసం సరా?" అని అడిగింది. శాస్త్రీజీ ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండానే ప్రక్కసందులోకి నిష్క్రమించేడు. ఆ పిల్ల ఒక్కర్తి నాలుగురోడ్ల కూడలివద్ద నిలుచుండిపోయింది. ఊళ్లోనూ అంతా నీరుగానేవుంది. గోదావరి ఊటచే కొంత, అప్పటికోవారంనుంచి కురిసే వానల జోరుచే కొంత, అసలు ఋతుపవనం "బ్రద్దలు" కావడంలోవుండే వింత కొంత, ఏలా వుండాలో అలావుంది పట్నమంతా. ఎటొచ్చి పట్నంలో మేలి ళ్ళున్నాయి, రోడ్లున్నాయి, దళ్ళుమళ్ళీ పడేపోనాయి. పందిళ్ళూ పాకలూ అంతే!

ఒక్క పురపాలక సంఘంవా రేర్పాటుగావించిన ఉద్యాన వనాల గోడలు, గోడల్లో తిన్నెలుమాత్ర మేలాగుండవలసిన వాలా

గున్నాయి. ఆ ఉద్యాన వనాలుమాత్రం చూడ సొంపుగా, పచ్చగా పచ్చిక మొలిచి కొత్తగా పూలు పూసి నవ్యత సూచిస్తూవున్నాయి.

ఒక్కచోట! కొండతంగేడు-ఊళ్లోనా అన్నట్టు-పైకి పెద్దగా నిలువెత్తు పెరిగి, వలంగా కొమ్మలుసాచి, రొట్టబోసి, చివళ్ళను పసుపుపచ్చగాబూసి గాలికాడుతూవుంది. దానినేసుకుంటా దరిదాపులోనే ఒక గోరింటదుబ్బల ఆకూముల్లూ బలిసి వంగుంటే వయ్యారిదన్నట్టు కనిపిస్తూవుంది. మరి నేలమీద మిగతాదంతా పచ్చికే! ఇంకా పాదులు పెట్టలేదు. దొంగవిత్తులన్నీ తొలకరికి బయలుబడ్డాయి అన్నట్టుంది ఆ ఆర్ద్రత ఆ హరిద్రత. గోడలు చుట్టూ వుండడంచేత గొడ్లు పడడంలేదు. లేకుంటే ఆ ఘడియ కెన్ని అంబోతులు, ఆవులు, బఱ్ఱెలు, లేగలు ఆ ఉద్యానంలో వుండేవో!

ఇది ఈ పడుచుపిల్ల మానిసికాబట్టి తలుపు ముందుద్రోసి, అది తాళంవేసి వుండడం కనిపెట్టి, చీర పైకెగ్గట్టి గోడదూకి లోపలికి దిగింది. ఆలోచన అతి సాహసం రెండూ కలిసి ఆమెచేత ఆపని చేయించాయి. చీర తెల్లనిచీర. రయిక నల్లని రయిక, వొళ్ళు కనబడే చోటల్లా తప్తకాంచనం. తైల సంస్కార మంతగా లేక నిగనిగ తక్కువైనా తలకట్టు చీకటిముల్లెలా కనిపిస్తూవుంది. వెనకనున్న కొండతంగేడు పువూ చెట్టూ అంతా ఆమె నిలుచున్నప్పుడు తలమీద ఆనినా ఆమె దాన్ని తొలగించుకోవడం మరచి ఎదటనున్న గోరింట పొదమీదకు వొఱిగి గోరింటాకు ఊ-కో సేస్తూ వుంది. మేక కనుక మేస్తూవుంటే ముళ్ళు వాటంత టవితప్పి అకూడి పడ్డట్టు, ఆ ఎమ్మెలాడి గుప్పిళ్లోకి ఈ గోరింటటాకు గ్రుచ్చుకోకుండా కూర్చుకుంటూ పడింది. ఆ యిల్లాలు ఎగ్గట్టిన చీర దిగజార్చి, ఒడిగా మార్చి, ఆ ఒడినే అంతల్లా ఇంతచేసి, ఇంతల్లా అంతచేసి అందులోకి ఈ గోరింటాకు చేర్చదొడగింది. పైని కొండతంగేడు ఆ బొమ్మకు నిలుచున్నప్పుడల్లా ఒక్కసారి

దాని సిగ నలంకరించి యూగిసలాడేది. వంగున్నప్పుడు "వల్లి మాల్నంత పట్టుకెళ్ళు తల్లీ!" అన్నట్టు గోరింట ఆహ్వానించేది. ఎండ కొంచెం తెల్లబాటి వెచ్చనెక్కి పచ్చికమీదను తడివొత్తేలా పరచబడివుంది. మిగతా లోకం అంతా తెగతెంపులేని తేమతో వామనంతో చికాకుగావుంది.

శాస్త్రి ఇంటికివెళ్ళి జందెంమీద జందెంలా ఒక తెల్లని అంచుల కండువా తిర్చి దిద్దుకు వేసుకుని, మాయాప్రవరుడా అన్నట్టు తానై ఆ యుద్యానవన ప్రాంతాన్ని నడుస్తూ "అమ్మీ! బందెలదొడ్డిలో పడగలవు" అన్నాడు. అమ్మి అటుతిరిగిచూస్తూ "నేనేం పశువునా?" అంది. "పశువువు కాకుంటె పామరాంగనవు" అన్నాడు.

అనడంలో గోదావరి గట్టంక చూచాడు. ప్రజ కోలాహలంగా నిలబడివున్నారు. గట్టు-మరి అంగుళం నీరొస్తే తెగిపోతుందనే ఆదుర్దాలో వున్నారు. ఎవళ్ళ సామాను వాళ్లు నెత్తినెట్టుకుంటూ "ఒత్తిగిలండి, ఒత్తిగిలండి ఇక్కడేం వింతచూచేరు. గండి పడిందా మీరు మేము నీరు అంతా ఏకమే! మీ సామాను మీ సంసారం చూచుకోండి!" అని హెచ్చరిస్తూ వున్నారు.

"అమ్మీ! మీగట్టు ఊలగొడుతూ వున్నట్టుంది. వింటున్నావా?" అన్నాడు బ్రాహ్మణుడు. "ఎంత సిల్లడివుంటుంది?" అంది గోడెక్కి దారికురుకుతూ. బ్రాహ్మణుడు "నీవు కోసిన గోరింటాకు ముద్దగానూరి మెత్తిదే సరి పోద్ది" అన్నాడు ఎటకారంగా. కాని ఆస్త్రీకి ఆ అపత్సమయములో పై ఎటకారపు మాటే నిజంగా తోచి, పరుగు పరుగున ప్రజను తప్పుకోమంటూ, తన సన్నికలు తన రాయినీట తేలకుండా వుండిపోవడం, స్థావరత్వానికి చిహ్నంగా చేకొని, అందుమీద తాను తెచ్చిన గోరింటాకు పచ్చిది పడేసింది-"తల్లి! శానే నూరుకుంటూంది!" అంటూ నిరాశ చూపులు చూచింది.

గోదావరి కెరటం దానంతటదే పాత్రాన్ని ముందుకు కదిపింది. ముద్దగా ఆకు నూరింది.

ఈ అంగనామణి ఆ పాళంగా ఆ ఆయిన గోరింటాకు ముద్ద ముద్దా ఊలగొట్టే రంధ్రంలోకి చొప్పించి

" ఆషాఢ మాసంబు ఆఖరువు కాకుండ
గోదారి తల్లికి గోరింట పట్టిస్తే ! "

అంటూ పాడింది.

బ్రాహ్మణుడా వెనకాలే నిలుచుండి "నీ గోళ్ళు చూచుకో" అన్నాడు. ఆమె చేతి వ్రేళ్ళు గోరింట ముద్ద మెత్తడంవల్లా, కాలి వ్రేళ్ళు మెత్తినచోట దిగబడ్డంవల్ల ఎఱ్ఱగా పండివున్నాయి.

" ఆషాఢ మాసంబు ఆఖరువు కాకుండ
అదికూడ సమకూరె ! మదిరాక్షి ! నీకిపుడు "

అన్నాడు బ్రాహ్మణ శ్రేష్ఠుడు.

" అది " అంటే " అవగాహమా ! అనురాగమా ! " అని ఎందరో వ్యాఖ్యానించేరుగాని నిజంగా బ్రాహ్మణునకు ఆ అమ్మివల్ల తుదకు ముట్టింది ఒక డబ్బు. అవితే లోకానికి తట్టింది పెద్ద ఎఱ్ఱనిమబ్బు! సూర్యుడు సిబ్బరేకంతై ఎద్దిగా క్రుంకిపోతూ ప్రవాహంమీద పరిధవిల్లజేసేడు.

... ... ... ... ...

## గోడవిఱిగిన నూయి

ఆ వూరికి ఎన్నాళ్లుగానో రోడ్డు రోడ్డు అని పలవరించగా తుదకు మొన్న మొన్నను ఒక ఎన్నికల సందర్భంలో తాలూకా బోర్డువారు ఒక పక్కా రోడ్డు వేయించారు. ఆరోడ్డు పొడుగు అంతా కొలిస్తే ఒక మైలు. కాని రోడ్డుపడిన తరువాత ఊళ్లో ప్రజలు పంచవర్ష ప్రణాళికక్రింద వేసికొన్న రోడ్డులు ఇరవైనాలుగట. ఫాటోలు